పగలు ఆరవు... రాత్రి వెలగవు!


ఐటీఐ జంక్షన్‌లో మిట్ట మధ్యాహ్నం వెలుగుతున్న హైమాస్ట్‌లైట్లు

- పట్టించుకోని జోన్‌– 5 విద్యుత్ విభాగం అధికారులు


ఫుట్‌పాత్‌పై వదిలేసిన విరిగిన విద్యుత్ స్తంభం


104 ఏరియా బీఆర్‌టీఎస్ రహదారిలో పగలే వెలుగులు

కంచరపాలెం: వీధి దీపాల నిర్వహణ గాడి తప్పడంతో కొన్ని చోట్ల పగలు వెలుగుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో అంధకారం అలముకుంటోంది.జీవీఎంసీ 56, 57వ వార్డుల పరిధిలోని కంచరపాలెం నేతాజీ కూడలి వంతెన రహదారిలో అంధకారం రాజ్యమేలుతోంది. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వీధిలైట్లు వెలగక పోవడంతో వేలాది వాహనాలు హెడ్‌లైట్లు–సిగ్నల్ లైట్లను అనుసరించి ప్రయాణాలు సాగిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

కంచరపాలెం నుంచి జ్ఞానాపురం వెళ్లే రహదారిలో ఇప్పటికే కొన్ని విద్యుత్ స్తంభాలు తుపానులు, ఈదురుగాలులకు నేలకొరిగాయి. విరిగిన స్తంభాలను తొలగించకుండా పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై అడ్డంగా వేసి వదిలేశారు. మరో వైపు వంతెనపై విద్యుత్ లైట్లు ఒక రోజు వెలిగితే మరో రోజు వెలగక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కొరవడిన నిర్వహణ

కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి నుంచి ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా బీఆర్‌టీఎస్ రహదారుల్లో పగటి సమయంలో నిత్యం వెలుగులు విరజిమ్ముతున్నాయి. బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ లైట్లతో పాటు ఆయా కూడలిలో హైమాస్ట్ లైట్లు కూడా నిర్వహణ లేక పగలూ వెలుగుతున్నాయి.

వీధుల్లో అంధకారం

కంచరపాలెం కూడలి నుంచి ఊర్వశికూడలి మీదుగా ఐటీఐ జంక్షన్ వరకు వీధుల్లో దీపాలు వెలగడంలేదు. ఆ ప్రాంతమంతా కటిక చీకటి అలముకుంటుంది. దీంతో సాయంత్రం అయితే బయటకు రాలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.

మురికివాడల్లో మరీ ఘోరం

జీవీఎంసీ 56, 57వ వార్డుల్లోని మురికివాడలైన ముత్యమాంబకాలనీ, పైడిమాంబకాలనీ, రాజీవ్‌నగర్, దయానందనగర్, చాకలిగెడ్డ, గొల్లకంచరపాలెం, గవరకంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, దుర్గానగర్, గౌరీనగర్ ప్రాంతాల్లో వీధి దీపాలు రోజుల తరబడి వెలగడం లేదని వాపోతున్నారు. సమస్యపై ఫిర్యాదులు చేసినా జీవీఎంసీ విద్యుత్ దీపాల అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.


కంచరపాలెం నేతాజీ వంతెనపై వెలగని లైటు

ఆకతాయిల బెడద పెరిగింది

రాత్రిపూట మా వీధుల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో స్తంభాలకు లైట్లు కనిపించడంలేదు. అటుగా రాకపోకలు సాగించాలంటే భయాందోళనగా ఉంది. ఆకతాయిల ఆగడాలు శృతిమించిపోతున్నాయి. పిల్లలను బయటకు పంపాలంటే భయమేస్తుంది. ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు.

– ఎస్.కృష్ణ, బాపూజీనగర్, 104 ఏరియా, మర్రిపాలెం.

అధికారులు స్పందించాలి

జోన్‌–5 పరిధిలో విద్యుత్ దీపాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటుంది. ప్రధాన రహదారుల్లో పగటి పూట నిత్యం లైట్లు వెలుగుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. సంబంధిత అధికారులు ఆయా వార్డుల్లో సాయంత్రం వేళ పర్యటించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడానికి కృషి చేయాలి.

–ఎస్.లక్ష్మి, ఊర్వశికూడలి

క్లుప్తంగా

చెల్లూరికి డాక్టరేట్


భాస్కరరావు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కర రావు గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సామాజిక సేవలకు గుర్తుగా సౌత్ ఆఫ్రికాలోని ఏపీకై జో ప్రొఫెటిక్ బైబిల్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఆఫ్ సోషల్ వర్క్ పేరిట డాక్టరేట్‌ను ఆదివారం ప్రకటించారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు చిత్రకారులు,సామాజిక సేవా కార్యకర్తలు చెల్లూరికి పుష్పగుచ్ఛాలను ఇచ్చి అభినందించారు. చెల్లూరి మాట్లాడుతూ వచ్చిన ఈ గౌరవ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


ప్రతిభ చూపిన చిత్రకారులకు బహుమతులు అందిస్తున్న అతిథులు

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు వర్ధంతి సందర్భంగా విశాఖ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన చిత్రకారులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. బీఎస్‌ఆర్ భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ వైద్యాధికారి డాక్టర్ పి.హేమలత,ప్రముఖ చిత్రకారుడు సుంకర చలపతిరావు, గాజువాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యాల కోటేశ్వరరావు తదితరులు విజేతలను అభినందించి బహుమతులు అందించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన


ప్లాస్టిక్ అనర్థాలపై ప్రచారం చేస్తున్న భూషణం మాస్టారు

విశాఖ విద్య: ప్లాస్టిక్ నిషేధం ఆవశ్యకతను వివరిస్తూ జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు భూషణం ఆదివారం విస్తృతంగా అవగాహన కల్పించారు. జనవరి 1న నుంచి నగరంలో ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తున్న నేపథ్యంలో ప్లకార్డులు చేతపట్టుకొని ఎన్‌ఏడీ ఏరియాలోని మెడికల్ షాపులకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణం కలుషితమై అనేక వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు.

ఓపెన్ పికిల్‌బాల్ టోర్నీలో వాల్తేరు క్లబ్ ప్రతిభ


ట్రోఫీతో చిరాగ్, కరణ్

బీచ్‌రోడ్డు: అత్తిలి స్పోర్ట్స్ ఎరీనాలో నిర్వహించిన విశాఖ ఓపెన్ పికిల్‌బాల్ టోర్నమెంట్‌లో వాల్తేరు క్లబ్ సభ్యులు ప్రతిభ చూపారు. ఈ క్లబ్‌కు చెందిన చిరాగ్ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసి సింగిల్స్‌లో విజయం సాధించాడు. కరణ్‌తో కలిసి డబుల్స్, రష్మికతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో విజేత నిలిచాడు. ఈ సందర్భంగా ఆదివారం అత్తిలి స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ శశికరణ్ విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పికిల్‌బాల్ క్రీడను ప్రోత్సహించేందుకు సిరిపురం, ఎండాడ, మాధవధార ప్రాంతాల్లో కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో నగరంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మెగా టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు.

తెలుగు మహా సభలకు చలపతిరావుకు ఆహ్వానం


సుంకర చలపతిరావు

మల్కాపురం: వచ్చే నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ వార్షిక అంతర్జాతీయ మహా సభలకు ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ సుంకర చలపతిరావుకు ఆహ్వానం అందింది. 59వ వార్డు హిమాచల్‌నగర్ ప్రాంత వాసి అయిన చలపతిరావు ఇటీవల తెలుగు ధనం ప్రత్యేక తెలుగు సంచికకు వ్యాసం రాసి పంపించారు. ఆ సంచికను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ ఇందిర దత్ మహా సభలకు హాజరు కావాలని ఆహ్వానం పంపారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు చిత్రకారులు,రచయితలు,కళాభిమానులు చలపతిరావుకు అభినందనలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేపీ ములగాడ మండల అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన లక్కరాజు రామకృష్ణను ఆదివారం ఆ పార్టీ కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కళాకారులు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలి


ఫ్రాన్సిస్ దంపతులను సత్కరిస్తున్న పల్లి నల్లనయ్య, రమణమూర్తి తదితరులు

సీతంపేట : కళాకారులు అన్ని రంగాలలో ప్రావీణ్యం సాధించాలని, నటులు, దర్శకులు, ప్రయోక్త, రచయిత పాలమరశెట్టి ఫ్రాన్సిస్ ఆ కోవకు చెందిన వ్యక్తే అని విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్, పిల్లుట్ల ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ నేవీ విశ్రాంత అడ్మిన్ ఆఫీసర్ పిల్లుట్ల శ్రీశైల మల్లికార్జున శర్మ 86వ జయంతి వేడుకలు ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్షోపన్యాసం చేస్తూ కళారంగానికి ఫ్రాన్సిస్ ఎనలేని సేవ చేశారని కొనియాడారు. కళాకారులు అతడిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాలమరశెట్టి ఫ్రాన్సిస్ దంపతులను అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ మాట్లాడుతూ సంస్థ ద్వారా గత 25 ఏళ్లలో ఎంతో మంది కళాకారులను సత్కరించామని, ఈ రోజు సంస్థ ద్వారా ఫ్రాన్సిస్ దంపతులను సత్కరించే అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విశాఖ పోర్టు సీఏవో దేవర రమణమూర్తి, శ్రీమాత అధినేత పల్లి నాగభూషణరావు, న్యాయవాది ఉమా సావిత్రి, జానపద గాయకుడు కె.ఆది, పిల్లుట్ల ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు పిల్లుట్ల గోపి, ఉత్తమ ఉపాధ్యాయుడు పి.నిర్మలరాజు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే ఉక్కుకు పూర్వవైభవం


నినాదాలు చేస్తున్న ఉక్కు శ్రామిక సంఘం నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం రావాలంటే సెయిల్‌లో విలీనం ఒక్కటే మార్గమని విశాఖ స్టీల్‌ప్లాంట్ శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1417వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఉక్కు శ్రామిక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, నిలిచిన టెండర్లు వెంటనే పిలవాలని కోరారు. కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు, వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్‌ఎన్‌ఎల్‌రావు, కరణం సత్యారావు, ఎం.ప్రకాష్, కరణం బాలయోగి, జీఆర్‌కె నాయుడు, మసేనురావు, నంబాల గణపతి, చెన్నారెడ్డి, కె.గోపి, ఎస్.రాజు, ఎ.అప్పారావు, పి.పెంటారావు, కె.కోటి కనకరెడ్డి, పి.విజయ, కె.సత్యవతి, కొండమ్మ, వెంకటలక్ష్మి, రమణమ్మ, వెంకటరావు పాల్గొన్నారు.

అద్భుతం.. భువన విజయం నాటక ప్రదర్శన


భువన విజయం నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన భువన విజయం నాటక ప్రదర్శన అద్భుతంగా సాగింది. ప్రతి ఏడాది చివరిలో కళాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది సాహిత్య సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా భువన విజయం నాటకాన్ని ప్రదర్శించారు. సాహితీవేత్తలతో సమ్మేళనం చేపట్టారు. ముందుగా ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, కట్టమూరి చంద్రశేఖర్, ఎ.ఇందిర, విజయలక్ష్మి, పిళ్లా రమణమూర్తిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ సాంస్కృతిక, సంగీత, నాట్య, సాహిత్య, నాటక, హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, జానపద కార్యక్రమాలను నిర్వహిస్తూ అన్ని కళలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గొప్ప సాహిత్య ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమే భువన విజయం నాటక ప్రదర్శనని పేర్కొన్నారు.

మరీ ఇంత చెత్తా!

డంపింగ్ యార్డులను తలపిస్తున్న రోడ్లు


61వ వార్డు వెంకన్నపాలెం సేవా మార్గంలో చెత్త తింటున్న మూగజీవాలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో పలు సేవా మార్గాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. కనీస బాధ్యత లేని కొంత మంది తమ ఇళ్లలోని వ్యర్థాలను దగ్గరలో ఉన్న సేవా మార్గాలపై నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. ఇలా డంప్ చేసిన వ్యర్థాలపై పశువులు చేరి ఆ పరిసరాలను మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి.

- జీవీఎంసీ 60వ వార్డు గుల్లపాలెం వుడాకాలనీ వద్ద మంచినీటి సరఫరా కార్యాలయం సమీపంలోని సర్వీసు రోడ్డు వెంబడి వ్యర్థాలను నిత్యం డంప్ చేస్తున్నారు. దీంతో పశువులు, పందులు చేరి మరింత చెత్త చేస్తున్నాయి.
- 61వ వార్డు వెంకన్నపాలెం వద్ద సేవా మార్గం డంపింగ్ యార్డ్‌ను తలపించే విధంగా ఉంది.మల్కాపురం పల్లివీధి వద్ద ఇదే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఆయా వార్డుల శానిటరీ అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా ఉండాలని పలువురు కోరుతున్నారు.


గుల్లలపాలెం మంచినీటి సరఫరా కార్యాలయం వద్ద డంప్ చేసిన వ్యర్థాలను తింటున్న ఆవులు



మల్కాపురం పల్లివీధి సేవా మార్గం వద్ద డంప్ చేసిన వ్యర్థాలు

రాజ్యాధికారంతోనే బీసీ సమస్యల పరిష్కారం

దాబాగార్డెన్స్: రాజ్యాధికారం ద్వారానే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. వార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ మెంబర్ వరకు జరిగే అన్ని ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించాలన్నారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు దక్కాల్సిన వాటాని ఓసీ సామాజిక వర్గాలు అన్ని రంగాల్లో లాక్కుంటున్నాయని మండిపడ్డారు. అందుకోసం జనగణన జరిపి, కులాల లెక్కల మేరకు అన్ని రంగాల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదని, జాతీయ కులగణన జరపలేదని, బీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. రాజకీయ చైతన్యం, ఓటు చైతన్యంపై ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బ్లూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు అమీనుద్దీన్, ప్రధాన కార్యదర్శి కామేట భూపాల్, కార్యదర్శి బానోతు లింగన్న, అధికార ప్రతినిధి మధు భూంపల్లి, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'వేంకటేశ్వర వైభవం' ప్రవచనాలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


మాస్టర్ ఇ.కె. రచించిన గోదా వైభవం కావ్యాన్ని విభీషణ శర్మకు బహూకరిస్తున్న సత్యదేవ్

ఎంవీపీకాలనీ: శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా ఈ నెల 26 నుంచి జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర వైభవం ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర స్వామి వైభవంపై చివరి రోజు చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కార్యక్రమ నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. మాస్టర్ ఇ.కె. రచించిన గోదా వైభవం కావ్యాన్ని విభీషణ శర్మకు జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ బహూకరించారు. ప్రవచనాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాలాపనలు ఆకట్టుకున్నాయి.

తెలుగు సాహిత్యానికి ఆదరణ


మాట్లాడుతున్న రచయిత ఈతకోట సుబ్బారావు

సీతంపేట : సాఫ్ట్‌వేర్ రంగం వచ్చినా తెలుగు కథలకు, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదని రచయిత ఈతకోట సుబ్బారావు అన్నారు. తటవర్తి భారతి స్మారక సాహిత్య సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కథ, కథనం అంశంపై ప్రసంగించారు. తారు రోడ్డు రాకముందే కథలు ఇక్కడ పుట్టాయని, మహాకవి ఆరుద్ర అన్నట్టు తల్లి ఒడిలో నుంచే కథలు నేర్చుకుంటామని తెలిపారు. కరోనా, సోషల్ మీడియా పుణ్యమా అని ఒక రకంగా తెలుగు భాష బతికి బట్ట కట్టిందన్నారు. కథల్లో మానవీయ కోణం ఉండాలని, మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న తరుణంలో కథల్లో కూడా మార్పు వచ్చిందన్నారు. తెలుగు సాహిత్యంలో ఎంతో మంది కథలు రాసే వారు ఉన్నారని, తెలుగు సాహిత్యానికి ఆదరణ తగ్గలేదన్నారు. ప్రముఖ రచయిత ఎం.సుగుణరావు మాట్లాడుతూ పాలకులు చేపట్టే విధానాల వల్ల రకరకాల సంస్కరణలు వచ్చాయని, ఫలితంగా కొన్ని కుల వృత్తులు దూరమయ్యాయని తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారి జీవనం ఏ విధంగా మారిందో తెలిపే కథలు వచ్చాయన్నారు. అలాగే గోద్రా అల్లర్లు తర్వాత వచ్చిన కథ, అమెరికన్ రచయిత జేమ్స్ రాసిన నవల గురించి వివరించారు. కథా పఠనం, రికార్డింగ్‌లో మెలకువలపై రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు ప్రసంగించారు. విమర్శ, విశ్లేషణ, సమీక్ష అనే అంశాలపై సీహెచ్.సుశీలమ్మ, డి.వి.సూర్యారావు మాట్లాడారు. కథల పోటీలు, పత్రికాధిపతుల సలహాలు అంశంపై సంపాదకులు గొర్లి శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శిరేల సన్యాసిరావు మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కథల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

పలువురికి పురస్కారాలు

ఈ సందర్భంగా 14 మంది కవులు, రచయితలకు తటవర్తి భారతి సాహిత్య పురస్కారాలు అందజేశారు. దాట్ల దేవదానం రాజు, ఈతకోట సుబ్బారావు, ఎం.సుగుణరావు, సీహెచ్.సుశీలమ్మ, డి.వి.సూర్యారావు, రాంబాబు కొప్పర్తి, పప్పు భోగారావు, ఇందూ రమణ, గొర్లి శ్రీనివాసరావు, శరత్‌చంద్ర, శిరేల సన్యాసిరావు, తటవర్తి శంకరరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డి పురస్కారాలు అందుకున్నారు.